క్లుప్తంగా

నేడు గోటి తలంబ్రాల కార్యక్రమం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం (నేడు) సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో గోటి తలంబ్రాలు కార్యక్రమం ప్రారంభమవుతుందని దేవాలయ ప్రధాన అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. వచ్చే నెల 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ముందస్తుగా చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

అవన్నీ తప్పుడు బిల్లులే..

ఖమ్మం మామిళ్లగూడెం: సీఎంఆర్ఎఫ్ సాయం కోసం తమ ఆస్పత్రి పేరిట తప్పుడు బిల్లులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని నగరంలోని వినాయక ఆస్పత్రి ఎండీ పసుమర్తి లక్ష్మణరావు కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ కోసం సమర్పించిన బిల్లులు తమవి కాకపోగా, సదరు వైద్యుడు తమ ఆస్పత్రిలో పనిచేయడం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే అన్ని ఆధారాలను విచారణకు వచ్చిన అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రవి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పాతర్లపాడు పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు



మాట్లాడుతున్న ఏఎంఓ రవికుమార్

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ రవికుమార్ 70 మంది విద్యార్థులకు పెన్నులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాల సాధనకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పంచ కళ్యాణి, ఉపాధ్యాయుడు సుదర్శన్, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ ఉప్పల య్య, సీఆర్పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చెల్లింపులతో పన్నులో రాయితీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తి పన్ను ముందస్తు చెల్లించడం ద్వారా రాయితీ పొందే అవకాశం ఉందని, నగర ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ప్రభుత్వం రాయితీ ఇస్తుందని చెప్పారు. బుధవారం నగరంలో పన్నుల వసూళ్లను కమిషనర్ పరిశీలించి, పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించే వారిని కలిసి స్కీం గురించి వివరించారు. ఆర్ఓ జి.శ్రీనివాస్, ఆర్ఐలు లోకేష్‌కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలపై అవగాహన

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) నిర్వహణ, సేవలపై ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి బుధవారం కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యాన విద్యార్థులు వచ్చారు. ఈసందర్భంగా డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరాబాబు బ్యాంక్ సేవలు, ఇతర అంశాలను వివరించారు. డీసీసీబీ జీఎం పద్మావతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు స్రవంతి, మధు, మధులిక, కళాశాల అధ్యాపకులు జి.ఆదశరాణి, డాక్టర్ పి.రాజిరెడ్డి, అనురాధ, కె.భవాని, సీహెచ్.రాజేష్, రామారావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఫీడర్ ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ధంసలాపురం సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా 11 కేవీ ఫీడర్‌ను బుధవారంఏర్పాటు చేసి సాంకేతిక చార్జ్ చేశారు. దీంతో నగరంలోని సంభానినగర్, ముస్తఫానగర్, శ్రీరాంనగర్, చెరువు బజార్, హార్వెస్ట్ స్కూల్ ఏరియా, అల్లీపురం రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను తగ్గించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ఏడీ రమేష్ తెలిపారు.

రాజేశ్వరపురంలో వివాదం, ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో యువకులు రెండు వర్గాలుగా విడిపోయి అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో సేవలందటం లేదని దివ్యాంగుడు లింగరాజు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐసీడీఎస్ సీడీపీఓ బాలాత్రిపురసుందరీ బుధవారం విచారణ చేపట్టగా, లింగరాజు, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వడ్లమూడి సంపత్ నడుమ వివాదం చోటు చేసుకుంది. దీంతో దివ్యాంగులమైన తమపై సంపత్ దాడి చేశాడని లింగరాజు, రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని కులం పేరుతో దూషించి తనపైనే లింగరాజు, రామకృష్ణతో పాటు మరో ఇద్దరు దాడి చేశారని సంపత్ ఇంకో ఫిర్యాదు చేయడం గమనార్హం.

సర్పంచ్‌ల సతమతం..!

అభివృద్ధి పనుల కోసం పరుగులు పెట్టించిన అధికారులు

- బిల్లుల చెల్లింపులో జాప్యం
- బకాయిల ఊసెత్తని ప్రభుత్వం
- అప్పుల ఊబిలో సర్పంచ్‌లు
- వడ్డీలు చెల్లించలేక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు ఇస్తున్నాయి. అన్నీ బాగానే ఉన్నా.. గ్రామాభివృద్ధి కోసం వివిధ పనులు చేపట్టిన సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బిల్లుల కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల సమావేశాల్లో ప్రభుత్వ తీరును తప్పుబడుతూ నిరసన తెలుపుతున్నారు. అప్పులు చేసి పనులు చేశామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల వద్ద సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో ఉన్నట్లు సమాచారం. అభివృద్ధి పనుల కోసం అధికారులు పరుగులు పెట్టించినా.. బిల్లులు చెల్లించే విషయంలో ప్రభుత్వం విస్మరించింది. దీంతో ఇట్లనే ఉంటదా అని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో 141 గ్రామపంచాయతీలు ఉన్నాయి. చాలా పంచాయతీల్లో దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. పంచాయతీలకు పన్నులు, నాన్‌ట్యాక్స్‌ల ద్వారా ఆదాయం సమకూరుతోంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంస్థల నిధులు గ్రాంట్ల రూపేణా జమ కావాలి. నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీకి పెద్దసంఖ్యలో రావాల్సి ఉంది. ఫిబ్రవరి నుంచి నేటి వరకు ప్రభుత్వాలు రూపాయి విడుదల చేయలేదు. ఇంటి పన్నులు, ఇతరాత్ర పన్నులు, ఆదాయాలను వెంటనే ఎస్‌టీఓ కార్యాలయంలో జమ చేయిస్తారు. కానీ పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. పాలేరు డివిజన్‌లోని నేలకొండపల్లి, కూసుమంచి, పాలేరు, పెద్దతండా, చెరువుమాధారం, రాజేశ్వరపురం తదితర పంచాయతీల్లో ఆదాయం ఉన్న వినియోగించుకోలేని దుస్థితిలో పాలకులు ఉన్నారు. ఫ్రీజింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

ఖర్చులు తప్పనిసరి...

నెలలు తరబడి ప్రభుత్వాలు గ్రాంట్ అందించకపోయినా.. ఖర్చులు మాత్రం తప్పటం లేదు. సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, డీజిల్ ఖర్చు, నర్సరీల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు ఇతరాత్ర ఖర్చులు పాలకులను వెంటాడుతున్నాయి. గ్రామాభివృద్ధిలో భాగంగా సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు చిల్లి గవ్వ కూడా ఇవ్వటం లేదు. అభివృద్ధి కోసం రూ.లక్షలు వడ్డీలకు తెచ్చి అభివృద్ధి చేశారు కానీ బిల్లులు రాకపోవటంతో అప్పులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా ప్రాంగణాలు బిల్లులు గురించి ప్రభుత్వం మరిచినట్లు ఉంది. అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన బిల్లుల ఊసేలేదు. చివరకు సర్పంచ్‌లకు ఇచ్చే గౌరవ వేతనాలు కూడా అందనే లేదు.



బిల్లుల విషయంలో అధికారులను ప్రశ్నిస్తున్న రాజేశ్వరపురం సర్పంచ్ పుల్లయ్య(ఫైల్)

రూ.10 లక్షలు రావాల్సి ఉంది..



అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేశా. దాదాపు రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. తెచ్చిన వాటికి వడ్డీలు కట్టలేక పోతున్నా. ప్రభుత్వం సర్పంచ్‌ల గోడును అర్థం చేసుకుని బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– భూక్యా సుధాకర్, సర్పంచ్, మంగాపురంతండా

నెలలు గడుస్తున్నాయి..



రూ.లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రతీ రోజు వారి ఖర్చులు చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నెలలు తరబడి బిల్లులు రాకపోవటంతో అభివృద్ధి ఎలా చేయాలి.. అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వ తీరు బాధకరంగా ఉంది.

– ఈవూరి సుజాత, సర్పంచ్, చెరువుమాధారం

పట్టించుకోవడం లేదు..



సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలు గురించి ప్రభుతాన్ని అడుగుతున్నాం.. కానీ పట్టించుకోవటం లేదు. చాలా మంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వారి బాధలు అర్థం చేసుకుని వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలి.

– వంగూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్, గువ్వలగూడెం

అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని రామదాసు ధ్యాన మందిరం, బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నాయకుడుజెర్రిపోతుల సత్యనారాయణ తదితరులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రామదాసు ధ్యాన మందిరంలో అభివృద్ధి పనుల పూర్తి, బౌద్ధక్షేత్రం వద్ద సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించగా కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు.

సామ్రాజ్యం సేవలు మరువలేనివి..

నేలకొండపల్లి: స్వాతంత్ర్య సమరయోధురాలు, మాజీ ఎమ్మెల్యే కర్నాటి కృష్ణయ్య సతీమణి సామ్రాజ్యం సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆమె రెండో వర్ధంతి సందర్భంగా మండలంలోని పాత కొత్తూరులో సామ్రాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు లతాదేవి, జితేందర్‌రెడ్డి, గోవిందరావు, కర్నాటి భానుప్రసాద్, చావా వంశీ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, కాశీబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య , అనంతు పుల్లయ్య పాల్గొన్నారు.

పులిపాటి ప్రసాద్‌కు పలువురి పరామర్శ



రంజాన్ తోఫా అందజేస్తున్న పులిపాటి ప్రసాద్

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: నగరంలోని పులిపాటి విద్యాసంస్థల అధినేత డాక్టర్ పులిపాటి ప్రసాద్ తండ్రి నర్సింహరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబీకులను బుధవారం పలువురు పరామర్శించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, నాయకులు చిరుమామిళ్ల రవికిరణ్, రడం సురేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. కాగా, ఐదుగురు నిరుపేద ముస్లిం కుటుంబాలకు పులిపాటి ప్రసాద్ రంజాన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే సంస్థ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసింతో పాటు ఎస్.కే.జానీపాషా పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్



ల్యాప్‌టాప్ అందజేస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలలో చదివి పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించిన విద్యార్థిని చెరుకూరి నివేదితకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ బాధ్యులు ల్యాప్‌టాప్ బహూకరించారు. నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నివేదిత తల్లిదండ్రులకు పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ల్యాబ్‌టాప్ అందజేసి మాట్లాడారు. తండ్రి వాచ్‌మెన్ అయినా కష్టపడి చదివి ఐఐటీలో సీటు సాధించడంతో ప్రోత్సహించేందుకు సంస్థ బాధ్యుల సహకారంతో రూ.40వేల విలువైన ల్యాప్‌టాప్‌ను అందించామన్నారు. సభ్యులు కొంగర పురుషోత్తమరావు, మద్దినేని ప్రసాదరావు, సిరిపురపు రమణారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న వైద్యులు

ఖమ్మంక్రైం: గుండెపోటు వచ్చినప్పుడు బాధితులకు చేయాల్సిన సీపీఆర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్ అన్నారు. నగరంలోని పోలీస్ కల్యాణ మండపంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీపీఆర్ శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాల ఉద్యోగులు, హోంగార్డ్‌లకు సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై గుండె వైద్య నిపుణులు ప్రయోగం ద్వారా వివరించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్టు కారణంగా పడిపోయిన వ్యక్తిని సీపీఆర్ విధానం ద్వారా కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జితేందర్, బాలకృష్ణ, అల్తాఫ్, ఆర్ఐలు రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నేలకొండపల్లి మండలంలోని బోదులబండ, పైనంపల్లి, బౌద్ధక్షేత్రం, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, జూపెడ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీవైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీలు, మంగీలాల్, వజ్జా రమ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంత, ఏడీఏ విజయచంద్ర, ఏఓ సీతారాంరెడ్డి, ఏపీఎం అలివేలుమంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో 30 ధాన్యం బస్తాలు చోరీకి గురైన బాధితుడు నారాయణను ఆర్థిక సాయమందించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు.



తిరుమలాయపాలెం: బీరోలులో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందాల

రంజాన్ దుస్తులు పంపిణీ..

కూసుమంచి/తిరుమలాయపాలెం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న దుస్తులను బుధవారం కూసుమంచితో పాటు తిరుమలాయపాలెం మండలం గోల్‌తండా పరిధిలోని జింకలగూడెం మసీదులో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు, పుల్లయ్య, మీనన్, ఎంపీడీఓ జయరాం, ఎంపీపీలు మంగీలాల్, బాణోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి పుట్టినరోజు సందర్భంగా పూజలు



అష్టలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ నీరజ తదితరులు



దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రామ్మోహన్‌రావు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా 12వ డివిజన్ మైత్రీనగర్‌లోని కనకదుర్గ సమేత అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజల్లో మేయర్ పి.నీరజ, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్లు ఆళ్ల నిరీషారెడ్డి, ప్రశాంతలక్ష్మితో పాటు వల్లభనేని రామారావు, తన్నీరు శోభారాణి, దేవభక్తుని కిషోర్, వాంకుడోతు నరేష్, పగడాల నాగరాజు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.అదేవిధంగా నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో నగర టీఆర్ఎస్ ఎస్‌టీసెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. సుడా డైరెక్టర్ దేవభక్తుని కిషోర్, మంత్రి పీఏ రవికిరణ్, నాయకులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఐదో డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకుడు తొట్టి కొమరయ్య ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ నీరజ, బచ్చు విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పంతంగి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కోదంతార, కిషన్ నాయక్, మల్లేష్ యాదవ్, బొల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మంవ్యవసాయం: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు, కార్మికులకు చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత ఆధ్వర్యాన మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, అధికారులు బి.బజార్, డి.నిర్మలతో పాటు సోమా నర్సింహారావు, మన్రెం కృష్ణ, తల్లాడ రమేష్, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్ పాల్గొన్నారు.
- ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు ఆధ్వర్యాన మామిళ్లగూడెం మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం ఏర్పాటుచేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్యతో పాటు జక్కుల లక్ష్మయ్య, జక్కుల వెంకటరమణ, దామోదర్‌రెడ్డి, ఆదినారాయణ, లక్ష్మి, శోభ, రమ్య పాల్గొన్నారు. అలాగే, మంత్రి అభిమానులు పలువురు రక్తదానం చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు చిరుమామిళ్ల రవికిరణ్, డౌలే సాయికిరణ్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.
- ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్ 36వ డివిజన్‌లో కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో యాచకులకు, వృద్ధులకు దుస్తులు దానం చేశారు. 25 మంది మహిళలు చీరెలు, 25 మంది పురుషులకు లుంగీలు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావు, గుంటుపల్లి దివాకర్ గుప్తా, ఆకుల సతీష్, బచ్చు మురళీకృష్ణతో పాటు పిల్లుట్ల కృష్ణ, కురువెళ్ల కాంతారావు, దాములూరి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతగుర్తిలో ఇంటింటికీ ప్రజాపంథా

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా ఇళ్ల స్థలాలు లేనివారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్థలం ఉన్నవారికి రూ.10 లక్షలతో ఇల్లు నిర్మించాలని చేస్తూ ఇంటింటికీ కరపత్రాలు అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పేదల బతుకులు బాగుపడతాయనుకుంటే కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.మదార్‌సాహెబ్, లింగనబోయిన నాగేశ్వరరావు, రామ్మూర్తి, ఆడెపు శంకర్, అడెపు సత్యం, ఎల్.విశ్వనాథం, వెంకన్న, రామయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న విజయమ్మ

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన 20 కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ బుధవారం ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, ఎ.వెంకన్న, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రంజాన్ తోఫా



తోఫా అందజేస్తున్న కార్పొరేటర్ రమావీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్ కార్పొరేటర్ శీలంశెట్టి రమ ఆధ్వర్యాన బుధవారం ముస్లింల ఇంటికి వెళ్లి రంజాన్ తోఫా, సేమియా ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముస్లింలందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలనే భావనతో ప్రభుత్వం దుస్తులు, తోఫా అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని 44వ డివిజన్‌లో గల మూడు మసీదుల పరిధిలోని ముస్లిం సోదరులకు స్థానిక కార్పొరేటర్ పాలెపు విజయ ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్‌తో పాటు పగడాల నాగరాజు, చిరుమామిళ్ల రవికిరణ్‌లు హాజరయ్యారు. అలాగే 26వ డివిజన్ గంజి షహీద్ మసీద్‌లో మేయర్ నీరజ రాంబ్రహ్మం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు.

'స్మార్ట్ కిడ్జ్'లో రంజాన్ వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. ఈ సందర్భంగా సేమ్యాలు, మిఠాయిలు పంచి ఆనందోత్సవాలు జరిపారు న్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొనండి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించే ఇఫ్తార్ విందులో ముస్లిం ఉద్యోగ సోదరులు పాల్గొనాలని టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ షేక్ అఫ్జల్ హసన్ కోరారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, మేయర్ నీరజ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, తాజుద్దీన్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు బాగు పడేదెన్నడో..?



నగరంలోని 3వ డివిజన్ జయనగర్‌కాలనీలో రెహనా ఐటీఐ పక్కరోడ్డు పేరుకే రోడ్డు అని చెప్పొచ్చు. గతంలో ఎప్పుడో వేసిన రోడ్డు అంతా గుంతలు పడి రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. నిత్యం ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదాచారులు పాలకులతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డు ఎప్పుడు బాగు పడుతుందోనని అంటున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఖమ్మం అర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : కుమార్, మున్సిపల్ ఏఈ ఖమ్మం
సెల్ నంబర్ : 94412 25169